ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
శుక్రవారం 31 అక్టోబరు 2025





పసుంపొన్‌లోని దేవర్ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు

నివాళులర్పిస్తున్న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, బీజేపీ నేతలు నయినార్ నాగేంద్రన్, హెచ్.రాజా తదితరులు

పసుంపొన్‌లో వైభవంగా

దేవర్ జయంతి వేడుకలు

● ఉపరాష్ట్రపతి సీపీఆర్, స్టాలిన్, ఈపీఎస్ సహా నేతల నివాళి

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ 118వ జయంతి వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. రామనాథపురం జిల్లా పసుంపొన్ గ్రామంలోని దేవర్ స్మారక స్థలం వద్ద గురువారం నిర్వహించిన 63వ గురుపూజ వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ (సీపీఆర్), ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తదితర నేతలు నివాళులర్పించారు. దేవర్ జయంతి వేడుకల సందర్భంగా ఆయన స్మారక స్థలాన్ని నిర్వాహకులు అందంగా అలంకరించారు. ఆ మార్గానికి ఇరువైపులా కళాకారులు మంగళవాయిద్యాలు, చండీ మేళాలు, బ్యాండ్ వాయిద్యాలు మ్రోగించారు.

ఉపరాష్ట్రపతి నివాళి...

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పసుంపొన్‌లోని ముత్తురామలింగ దేవర్ స్మారక స్థలం వద్ద స్వర్ణ కవచధారణలో ఉన్న విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. సీపీఆర్‌తోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, హెచ్.రాజా తదితరులున్నారు.

స్టాలిన్ సహా మంత్రుల నివాళి...

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం ఉదయం మదురై గోరిపాళయంలో ఉన్న దేవర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత కారులో పసుంపొన్ గ్రామానికి వెళ్ళారు. దేవర్ స్మారకస్థలంలో సమాధిపై పూలమాలలు వేసి, స్వర్ణకవచం ధరించిన దేవర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుండి ముక్కులత్తోర్ కులస్థులకు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పలు పథకాలు అమలు చేశారని, ప్రత్యేకంగా దేవర్ విద్యా సంఘం రూపొందించారని, ఆ తర్వాత పసుంపొన్ పేరుతో కళాశాల ఏర్పాటుకు 44.94 ఎకరాలు కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం పసుంపొన్ ప్రాంతంలో కల్యాణమండపం నిర్మించాలని దేవర్ అభిమానులు, ఆయన కులస్థులు చేసిన విజ్ఞప్తి మేరకు రూ.3 కోట్లతో కళ్యాణ మండపాన్ని నిర్మించనున్నామని స్టాలిన్ ప్రకటించారు. స్టాలిన్‌తో పాటు మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, అన్బిల్‌మహేష్ పొయ్యామొళి, పళనివేల్ త్యాగరాజన్, పెరియసామి, కేఎన్ నెహ్రూ, తంగం తెన్నరసు, కేఆర్ పెరియకరుప్పన్, పి.మూర్తి, టీఆర్బీ రాజా, ఎంపీలు కనిమొళి, నవాజ్‌గనీ, డీఎంకే స్థానిక నాయకులు నివాళులర్పించారు.

ఒకే కారులో ఓపీఎస్, సెంగోటయ్యన్...

ఇదిలా ఉండగా దేవర్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి కేఏ సెంగోటయ్యన్ ఒకే కారులో వెళ్లటం కలకలం సృష్టించింది. వీరితోపాటు అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్ కూడా దేవర్ స్మారక స్థలానికి వెళ్ళి నివాళులర్పించారు. ఆ తర్వాత శశికళ కూడా వస్తున్నారని తెలుసుకుని ఆమె కోసం ఈ ముగ్గురు కాసేపు వేచి చూశారు. శశికళ రాగానే ముగ్గురు ఆమె ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ఆ తరవాఆత ఆమె దేవర్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, మాజీ మంత్రులు

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో...: ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) దేవర్ స్మారక స్థలంపై పూలమాల వేసి, స్వర్ణ కవచధారి దేవర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈపీఎస్‌తోపాటు సెల్లూరు రాజు, దిండుగల్ శీనివాసన్, కామరాజ్, విజయభాస్కర్, నత్తం విశ్వనాథన్, ఎస్పీ వేలుమణి, ఆర్బీ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై 2న అఖిల పక్షం

● 40 పార్టీలకు డీఎంకే ఆహ్వానం
● హాజరుకానున్న రాందాస్, సీమాన్, ప్రేమలత



పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రారంభమవుతున్న నేపథ్యలో ఎన్నికల సంఘం చేపట్టే ఈ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న డీఎంకే నవంబర్ 2న అఖిలపక్ష సమావేశానికి సిద్ధమవుతోంది. బీజేపీకి ఓటువేయని మైనారిటీ వర్గాలకు చెందిన, ఎస్సీ, ఎస్టీ ఓటర్లను తొలగించేందుకే కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ పేరుతో ఈ ప్రక్రియను చేపడుతోందంటూ డీఎంకే మిత్రపక్షాలు బీహార్‌లో జరిగిన ఓట్ల చోరీని ఉదహరిస్తూ ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 2న టి.నగర్‌లోని అకార్డ్ హోటల్‌లో సమావేశం జరిపేందుకు డీఎంకే నేతలు ఏర్పాటు చేపడుతున్నారు. ఈ అఖిల పక్ష సమావేశానికి డీఎంకే కూటమి పార్టీలు సహా మొత్తం 40 పార్టీలకు చెందిన ప్రతినిధులను ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే డీఎంకే నేతలు పూచ్చి మురుగన్, హార్బర్ ఖాజా, ఆస్టిన్ తదితరులు వివిధ రాజకీయ పార్టీల నేతలను కలిసి ఆహ్వానిస్తున్నారు. ఎంఎన్ఎం నేత కమల్ హాసన్, టీఎంకే నేత జీకే వాసన్, డీఎండీకే నాయకురాలు ప్రేమలత, డీపీఐ నేత తిరుమావళవన్, ముక్కులత్తోర్ పులిపడై నేత కరుణాస్, సీపీఎం, సీపీఐ నేతలను కలిసి ఆహ్వానించారు. ఇదే విధంగా టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, ద్రావిడ కళగం నేత కే వీరమణి, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి ఈశ్వరన్, తమిళగవాల్వురిమై కట్చి నేత వేల్‌మురుగన్‌ను వారి నివాసాలకే వెళ్ళి డీఎంకే నేతలు ఆహ్వానించారు. పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్, మాజీ ముఖ్యమంత్రి ఒ పన్నీర్‌సెల్వను కూడా ఈ సమావేశంలో పాల్గొనాలని ఆహ్వానించారు.

ఆ ముగ్గురికీ ఆహ్వానం లేదు

ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, పీఎంకే నేత డాక్టర్ అన్బుమణిని అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించలేదని డీఎంకే నేతలు తెలిపారు. టీవీకే నేత విజయ్ పార్టీని ప్రారంభించినప్పటి నుంచి డీఎంకే తమకు రాజకీయ శత్రువు అని ప్రకటించి ముఖ్యమంత్రి స్టాలిన్‌పై అదే పనిగా విమర్శలు చేసినప్పటికీ ఆ పార్టీ ప్రతినిధులను అఖిల పక్ష సమావేశానికి ఆహ్వానించడం రాజకీయ వర్గాలకు విస్మయం కలిగించింది. డీఎండీకే నాయకురాలు ప్రేమలత కూడా డీఎంకే పట్ల సానుకూల వైఖరినే అవలంబిస్తుండటంతో ఆమె తప్పకుండా అఖిలపక్ష సమావేశానికి హాజరవుతారని చెబుతున్నారు.

ఎస్ఐఆర్‌పై ఓటర్లలో అవగాహన కల్పించండి

● కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశం



ఎన్నికల సంఘ ప్రధానాధికారి అర్చనా పట్నాయక్

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలో జరుపనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఓటర్లలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి అర్చనా పట్నాయక్ విజ్ఞప్తి చేశారు. చెన్నై సచివాలయం నుంచి గురువారం మధ్యాహ్నం ఆమె చెన్నై సహా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతివార్డుకు ఒకరు చొప్పున ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ ఓటర్ల జాబితాతో వెళ్ళి అక్కడ నివసిస్తున్న వారి పేర్లు, జాబితాలో ఉన్న పేర్లు సరిపోయాయో లేదో పరిశీలించేలా కలెక్టర్లు సిబ్బందికి ఆదేశాలివ్వాలని తెలిపారు. ఈ సవరణపై ఓటర్లలో అనుమానం కలగకుండా వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జాబితాల్లో పేర్కొన్న చిరునామాలలో లేని ఓటర్ల పేర్లనే తొలగించడం జరుగుతుందని, రెండు నియోజకవర్గాల్లో ఓటు హక్కున్నవారి పేర్లను, అదే విధంగా జాబితాలో మృతి చెందిన ఓటర్ల పేర్లను మాత్రమే తొలగించి ఈ సవరణ పనులను పకడ్బందీగా చేపట్టనున్నామని ప్రజలకు వివరించాలని ఆమె ఆదేశించారు. జనవరి ఒకటి నాటికి ఓటుహక్కు పొందే కొత్త ఓటర్ల పేర్లను కూడా జాబితాలో చేర్చనున్నట్టు ప్రజలకు తెలపాలని, నూటికి నూరు శాతం కచ్చితమైన వివరాలతోనే జాబితాను సవరించనున్నామని కూడా వివరించాలన్నారు.

కరూర్ దుర్ఘటనపై 11 రోజుల తర్వాత సీబీఐ విచారణ ప్రారంభం



కరూరు కలెక్టరేట్ నుంచి బయలు దేరుతున్న సీబీఐ అధికారులు

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత నెల 27వ తేదీ రాత్రి టీవీకే నేత విజయ్ కరూర్‌లో రోడ్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందిన సంఘటనపై దర్యాప్తును చేపట్టిన సీబీఐ అధికారులు 11 రోజుల విరామం తర్వాత మళ్ళీ విచారణ ప్రారంభించారు. గుజరాత్‌కు చెందిన ఎస్పీ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో ఏఎస్పీ ముఖేష్‌కుమార్, డీఎస్పీ రామకృష్ణన్ సహా ఆరుగురు సభ్యుల సీబీఐ బృందం ఈ నెల 15న కరూర్‌లో విచారణ ప్రారంభించింది. దుర్ఘటన జరిగిన వేలుచ్చామిపురం వెళ్ళిన సీబీఐ అధికారులు ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారితో సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీబీఐ అధికారుల కోసం కరూరు కలెక్టరేట్ వద్ద టూరిస్ట్ బంగళా కేటాయించగా, దానిని సీబీఐ అధికారులు తమ కార్యాలయంగా ఉపయోగించుకుంటున్నారు. ఆ తర్వాత ఈ నెల 18న కరూరు కోర్టులో మేజిస్ట్రేట్ చార్లెస్ ఆల్బర్ట్ సమక్షంలో తమ విచారణకు సంబంధించిన ప్రాథమిక దర్యాప్తు నివేదిక సమర్పించారు. అందులో కరూర్ దుర్ఘటనకు టీవీకే జిల్లా కార్యదర్శి మదిఅళగన్, పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, డిప్యూటీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ తదితరులపై కేసులు నమోదు చేశారు. కోర్టులో ఎఫ్ఐఆర్‌ను సమర్పించిన తర్వాత సీబీఐ అధికారులు తమ స్వరాష్ట్రమైన గుజరాత్ వెళ్ళారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం తిరిగొచ్చిన సీబీఐ అధికారులు గురువారం తమ విచారణ ప్రారంభించారు. కలె సీబీఐ బృందం వేలుచ్చామిపురం, మృతుల కుటుంబీకులు నివసిస్తున్న ప్రాంతాలకు వెళ్ళారు.



జీసీసీ సమావేశంలో పాల్గొన్న మేయర్ ప్రియ, కార్పొరేటర్లు, అధికారులు

పెంపుడు జంతువులకు లైసెన్స్ లేకుంటే రూ.5వేల జరిమానా

● జీసీసీ సమావేశంలో తీర్మానం

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో పెంపుడు జంతువులకు లైసెన్స్ పొందకపోతే వాటి యజమానులకు రూ.5వేలు జరిమానా విధించబడుతుందని జీసీసీ కౌన్సిల్ సమావేశంలో చేసిన తీర్మానం ఆమోదం పొందింది. రిప్పన్ బిల్డింగ్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం మేయర్ ఆర్.ప్రియ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమరగురుబరన్, వివిధ పార్టీల కార్పొరేటర్లు పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సభ్యుడు తీర్థి కోరారు. కార్పొరేటర్ విధుల నుండి బాబ్కట్ యంత్రాలను కొనుగోలు చేసేందుకు అనుమతించాలని జోనల్ ఛైర్మన్ వీవీ.రాజన్ కోరారు. వారి అభ్యర్థనలను పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నట్లు కమిషనర్ కుమరగురుబరన్ హామీ ఇచ్చారు. అనంతరం అన్నాడీఎంకే కౌన్సిల్ ఛైర్మన్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ, తనకు ఓటేసి గెలిపించిన 182వ వార్డులో మూడేళ్లగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, డీఎంకే పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిష్కరింపబడటంలేదని ఆరోపించారు. అందుకు డీఎంకే సభ్యులంతా ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తనకు మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని సతీష్‌కుమార్ కోరికను మేయర్ నిరాకరించారు. దీంతో మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అన్నాడీఎంకే సభ్యులు సమావేశం నుండి వాకౌట్ చేశారు. ఈ నేపథ్యంలో, జీసీసీ సమావేశం మొత్తం 71 తీర్మానాలకు ఆమోద ముద్రవేసింది. సమావేశం అనంతరం ఈ తీర్మానాల గురించి మేయర్ ప్రియ మీడియాకు వివరించారు. కౌన్సిల్ సమావేశంలో అన్ని పార్టీల సభ్యులు తమ వార్డుల్లో సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. నగరంలో పెంపుడు జంతువులకు వచ్చే నెల 24వ తేదీలోగా లైసెన్స్ పొందాలని, గడువు పూర్తయ్యేలోపు లైసెన్సు పొందని పెంపుడు జంతువుల యజమానులకు రూ.5వేల జరిమానా విధించనున్నట్లు ఆమె తెలిపారు. మైలాపూర్ మందవెల్లిపాక్కంలో ఉన్న ఈస్ట్ రింగు రోడ్డును దివంగత నేపథ్యగాయకుడు సీర్గాలి గోవిందరాజన్ రోడ్డుగా పేరు మార్చినట్లుగా మేయర్ తెలిపారు.

పొత్తుపై టీవీకేతో మంతనాలు జరపలేదు

● ఎడప్పాడి పళనిస్వామి



పసుంపొన్‌లో అన్నదాన సత్రాన్ని ప్రారంభిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల పొత్తు గురించి సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకేతో చర్చలు జరపలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వెల్లడించారు. స్వాతంత్ర సమరయోధుడు పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ 118వ జయంతి, 63వ వార్షిక గురుపూజోత్సవం సందర్భంగా రామనాథపురం జిల్లా పసుంపొన్ దేవర్ స్మారక మందిరంలో ఉన్న ఆయన శిలావిగ్రహానికి అన్నాడీఎంకే తరఫున మాజీమంత్రులతో కలిసి ఈపీఎస్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మదురై జిల్లా కబ్బలూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ విజయ్‌తో పొత్తుపై ఎలాంటి చర్చలు జరపలేదని, కూటమిపై రాయబారాలు జరుగుతున్నట్లు సోషల్‌మీడియాల్లో వచ్చే కథనాలు అవాస్తవాలన్నారు. తాను పాల్గొంటున్న ప్రచార సభల్లో కొంతమంది టీవీకే జెండాలతో వచ్చి స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. మాజీముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్), మాజీమంత్రి సెంగోటయ్యన్, టీటీవీ దినకరన్ డీఎంకే బీటీంగా వ్యవహరిస్తున్నారని, వీరి కుట్రల వల్లే 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే అధికారంలోకి రాలేకపోయిందని విమర్శించారు. పార్టీకి వెన్నుపోటు పొడిచి, పార్టీ నిబంధనలను అతిక్రమించేవారు ఎవరైనా సహించేది లేదని, అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలుంటాయని ఆయన మరోమారు హెచ్చరించారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జాబితా సవరణపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఈపీఎస్ సమాధానం చెబుతూ, ఎస్ఐఆర్ అంటే సహజంగా భయపడాల్సింది ప్రతిపక్షాలలేనని, అయితే రాష్ట్రంలో అధికార డీఎంకే దీనిపై ఎందుకు ఆందోళన చెందుతుందో అర్థం కావడం లేదన్నారు. రైతుల నుండి ఏడాదికి సుమారు 42లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ అబద్ధాలు చెబుతున్నారని, ధాన్యం కొనుగోలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముత్తురామలింగ దేవర్‌కు 'భారతరత్న' ప్రకటించాలని కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ సమర్పించినట్లు ఈపీఎస్ తెలిపారు.

వైభవంగా స్థలశయనపెరుమాళ్ రథోత్సవం



చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవ దివ్య దేశాల్లో 63వ దైన మహాబలిపురం స్థలశయన పెరుమాళ్ ఆలయ భూదత్తాళ్వార్ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం మహారథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 22న ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భూదత్తాళ్వార్‌కు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ జరిపారు. సూర్యప్రభ, చంద్రప్రభ, గజవాహనాల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహారథోత్సవం గురువార ఉదయం ప్రారంభమైంది. ఆలయ మాడ వీధుల్లో ఊరేగిన తర్వాత ఆ రథం మండప ప్రాంతానికి చేర్చారు.

సమాచార దర్శిని

రాష్ట్రంలో మరో సైనిక పాఠశాల

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకే ఒక సైనిక పాఠశాల ఉన్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం మరో పాఠశాలకు అనుమతులు మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా 33 సైనిక పాఠశాలలున్నాయి. రాష్ట్రంలో ఉడుమలైపేట సమీపం అమరావతి నగరంలో ఒక పాఠశాల ఉంది. గత ఏడాది దేశవ్యాప్తంగా కొత్తగా 19 సైనిక పాఠశాలలు, ఈ ఏడాది మూడు పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందులో, రాష్ట్రంలోని నామక్కల్ జిల్లాలో ఒక పాఠశాల ఏర్పాటుకానుంది. ఆ ప్రకారం, నామక్కల్ ఎస్‌బీకే పబ్లిక్ సీనియర్ సెకండరీ స్కూల్ సైనిక పాఠశాలగా మారనుంది.

వాల్పారై వెళ్లాలంటే 1 నుంచి ఈ-పాస్ తప్పనిసరి

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా వాల్పారైకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఈ క్రమంలో, నవంబరు 1వ తేది నుంచి వాల్పారైకు వచ్చే పర్యాటకులు తప్పనిసరిగా ఈ-పాస్ పొందాలని కోవై జిల్లా కలెక్టర్ పవన్ కుమార్ ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... మద్రాసు హైకోర్టు ఉత్తర్వుల మేరకు కోవై జిల్లా వాల్పారైకు నవంబరు 1వ తేది ఈ-పాస్ విధానం అమలుచేస్తున్నామన్నారు. వాల్పారైకు వాహనాల్లో వచ్చే ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా ఈ-పాస్ పొందాలన్నారు. అలాగే, ఆళియారు, సోలయార్ తదితర చెక్‌పోస్టుల వద్ద కూడా ఈ-పాస్ పొందే సదుపాయం కల్పించామన్నారు. ఈ-పాస్ లేని వాహనాలను వాల్పారైకు అనుమతించమన్నారు. అలాగే, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను పర్యాటకులు తీసుకురాకూడదని కలెక్టర్ తెలిపారు.

తాగునీటి జలాశయాల్లో 80 శాతం నీటినిల్వలు

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల కారణంగా కురుస్తున్న వర్షాలతో రాజధాని నగరానికి తాగునీరు అందించే జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. నగరానికి చెంబరంబాక్కం, పుళల్, పూండి, చోళవరం, కన్నన్ కోట తేర్వాయ్ కండిగై తదితర జలాశయాల నుంచి తాగునీరు సరఫరా చేస్తుంటారు. ఈ ఐదు జలాశయాల పూర్తి సామర్థ్యం 11.525 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.497 టీఎంసీల నీటినిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతు కారణంగా పులియాంతోపు పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. పులియాంతోపు పరిధిలోని సైడన్స్‌హామ్స్ రోడ్డు, కన్నప్పర్ తిడల్, రిబ్బన్ భవనం, సుందరాపురం, నెహ్రూ టింబర్ మార్ట్, అప్పారావు గార్డన్, డెమెలస్ రోడ్డు, వీఓసీ నగర్, అంబేద్కర్ నగర్, అమ్మైయమ్మాళ్ వీధి, కుట్టితాంబురన్ వీధి, కన్నికుప్పంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. అదేవిధంగా గాంధీ నగర్, పౌడర్ మిల్స్ రోడ్డు, సత్యవాణి ముత్తు నగర్, వీరసామి వీధి, పార్థసారధి వీధి, నాచియరమ్మాళ్ లైన్, తిరువిక నగర్, పదీశన్ పురం, అంబేద్కర్ నగర్, మన్నార్‌సామి వీధి, రామస్వామి వీధి, తిరువేంగడస్వామి వీధి, పులియాంతోపు హైరోడ్డు, జాఫర్‌ఖాన్ వీధి, బోలనాయకన్ వీధి, నాచరమ్మాళ్ వీధి, మన్నస్వామి వీధి, నారాయణస్వామి వీధి, డెకాస్టర్ రోడ్డు, చూలై మోతిలాల్ వీధి, కాట్టూరు నల్లముత్తు వీధి, అంకాళమ్మన్ ఆలయ వీధి, అష్టభుజం రోడ్డు, చూలై పెరియార్ నగర్, పార్థసారధి నగర్, మునుస్వామి నగర్, అవడి శ్రీనివాసన్ వీధి, కేఎం గార్డన్, సుబ్బనాయుడు వీధి, జీవీ ఆలయ వీధిలో విద్యుత్ సరఫరా ఉండదని బోర్డు వెల్లడించింది.

'ఈశాన్యం'తో 41 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల రాష్ట్రంలో 41 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో బుధవారం వరకు సాధారణ వర్షపాతం 165.2 మి.మీ కాగా, 41 శాతం అదనంగా 233.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే, రాజధాని నగరం చెన్నైలో సాధారణ వర్షపాతం 260.9 మి.మీ కాగా, 36 శాతం అదనంగా 354.7 శాతం వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

రేపు తిరువళ్లూర్ జిల్లాలో పనిచేయనున్న విద్యా సంస్థలు

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో శనివారం (నవంబరు 1వ తేది) అన్ని విద్యా సంస్థలు పనిచేస్తాయని జిల్లా విద్యాధికారులు తెలిపారు. రాష్ట్రంలో భారీవర్షాల కారణంగా ఈ నెల 22వ తేది విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఈ సెలవు భర్తీచేసేలా శనివారం విద్యాసంస్థలు యధావిధిగా పూర్తిరోజు పనిచేస్తాయని విద్యాధికారులు తెలిపారు.

రేపు ఎస్‌ఆర్‌ఎంసీలో హృద్రోగులకు ఉచిత వైద్యశిబిరం

పెరంబూర్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా శ్రీరామచంద్ర పునరావాస కేంద్రం (ఎస్‌ఆర్‌ఎంసీ)లో నవంబరు 1వ తేది గుండెపోటు బాధితుల ఉచిత వైద్యశిబిరం జరుగనుంది. ఆస్పత్రి ప్రాంగణంలోని (ఎమర్జెన్సీకి ఎదురుగా) భవనంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నారు. గుండెపోటు అనంతరం మాట్లాడడం, మింగడం, నడువడం, సంభాషణ వినడం, రోజువారీ కార్యకలాపాలు చేయడం, చదవడం, రాయడం తదితర నాడీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఈ శిబిరంలో పాల్గొని, జీవన విధానంపై నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవచ్చు. అలాంటివారు తమ చికిత్స రికార్డులను తీసుకురావాలి. శిబిరంలో పాల్గొనదలచిన వారు 9940184280, 044-45928640 నెంబర్లు సంప్రదించి పేర్లు నమోదుచేసుకోవాలి. మరిన్ని వివరాలకు స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ విభాగం, ఆడియాలజీ ప్రొఫెసర్, హెచ్ డా.ఆర్‌సీ పెరుమాళ్‌ను 9840199567 అనే నెంబరు సంప్రదించవచ్చని మీడియా అండ్ కార్పొరేట్ రిలేషన్స్ హెడ్ డి.శివజ్ఞానవేల్ ఒక ప్రకటనలో తెలిపారు.

సెయింట్ జార్జి కెథడ్రల్ చర్చికి నూతన సొబగులు

● రేపే పునప్రారంభం



సెయింట్ జార్జి కెథడ్రల్ చర్చి

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ హయాంలో నిర్మించిన ప్రాచీన క్రైస్తవాలయాల్లో ఒకటైన సెయింట్ జార్జి కోట ప్రాంగణంలోని కెథడ్రల్ చర్చికి 210 ఏళ్ల చరిత్ర ఉంది. గోతిక్ ఆర్కిటిక్ విధానంలో క్రైస్తవ మిషనరీలు నిర్మించిన ఈ ఆలయాన్ని చెక్కుచెదరకుండా పునరుద్ధరించాలని చర్చి ప్రతినిధులు నిర్ణయించారు. గత జనవరిలో ప్రారంభించిన పునరుద్ధరణ పనులు ప్రస్తుతం పూర్తయ్యాయి. ఒక్కొక్క స్తంభాన్ని అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో పునరుద్ధరించారు. ప్రముఖ ఆర్కిటెక్చర్లు, ఇంజనీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ అరుణ్ మేనన్ ఈ పనులను సకాలంలో పూర్తిచేసినట్లు ఫాదర్ డేవిడ్ దేవసహాయం పేర్కొన్నారు. సీఎస్ఐ చెన్నై బిషప్ పాల్ ఫ్రాన్సిస్ రవిచంద్రన్ ఈ చర్చి విశిష్ఠతను మీడియాకు వివరించారు. 1816వ సంవత్సరంలో సెయింట్ జార్జి కెథడ్రల్ చర్చి అప్పటి పాలకులు అద్భుతంగా నిర్మించారని, ఈ భవనం పూర్వవైభవం చెక్కుచెదరకుండా చేపట్టిన పునరుద్ధరణ పనులు తృప్తికరంగా పూర్తయ్యాయన్నారు. ఈ కొత్త చర్చిని శనివారం సాయంత్రం 5 గంటలకు సీనియర్ బిషప్ రూబన్ మార్క్ ప్రారంభిస్తారని, ముందుగా జెమినీ సర్కిల్‌లో ఉన్న కెథడ్రల్ చర్చి ప్రాంగణం నుండి బిషప్‌లు, ఫాదర్లు ఊరేగింపుగా బయలుదేరి సెయింట్ జార్జికోటకు చేరుకుంటారని తెలిపారు. చర్చి ఫాదర్ రూబన్ జయకుమార్ మాట్లాడుతూ, ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన ఇంజనీర్లు కర్నల్ జేమ్స్ కాల్డ్‌వెల్, కెప్టెన్ థామస్ 1815లో ఈ ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించి 10నెలల వ్యవధిలోనే పూర్తిచేశారని తెలిపారు. ఇదిలా వుండగా, పలు ప్రాంతాల నుండి నగరానికి విచ్చేస్తున్న స్వదేశీ, విదేశీ పర్యాటకులు తప్పనిసరిగా సెయింట్ జార్జి కోట ప్రాంగణంలోని ఈ చర్చిని సందర్శించి వెళుతుంటారు.

సీపీఎం నేతల శరీరదానం

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్యకళాశాల పరిశోధనలకు వంద మంది సీపీఎం కార్యకర్తలు తమ శరారాలు అందించేందుకు అంగీకరించారు. మృతిచెందిన తర్వాత తమ శరీరాలను పరిశోధనలకు వినియోగించుకోవచ్చని వైద్యకళాశాల డీన్‌కు వారు ఆమోద పత్రాలు అందజేశారు.

కూడన్‌కుళం రెండో యూనిట్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేత

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రంలో, రెండు యూనిట్ల ద్వారా తలా 1,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఈ విద్యుత్‌లో 1,152 మెగావాట్లు రాష్ట్రానికి, మిగిలిన విద్యుత్ పొరుగు రాష్ట్రాలకు కేటాయించారు. ఈ క్రమంలో, కూడన్‌కుళం రెండో అణు యూనిట్‌లో ఇంధనం నింపే పనులు కారణంగా ఈ నెల 27వ తేది సాయంత్రం నుంచి నెల రోజులు విద్యుదుత్పత్తి నిలిపివేశారు. ఒకటో యూనిట్ మాత్రం యథావిధిగా పనిచేయనుంది. ఈ విషయమై విద్యుత్ బోర్డు అధికారు లు మాట్లాడుతూ... రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభం కావడంతో, విద్యుత్ వినియోగం తగ్గిందన్నారు. అందువల్ల, కూడన్‌కుళం అణువిద్యుత్ నుంచి విద్యుత్ లభించకపోయినా, విద్యుత్ అవసరాలు పూర్తిచేసే స్థాయికి విద్యుదుత్పత్తి జరుగుతోందని తెలిపారు.

మదురైలో నీటి అడుగున 'అక్వేరియం'

● నేడు ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మదురై వండియూర్ టోల్‌గేట్ సమీపంలోని అమ్మ మైదానంలో 'ది ఓషన్' సంస్థ రూ.10 కోట్లతో నీటి అడుగున అక్వేరియం ఏర్పాటుచేసింది. పూర్తిగా ఎయిర్ కండిషన్ చేయబడిన ఈ ప్రదర్శనలో, సముద్ర గర్భంలో రంగురంగుల దృశ్యాలు, లక్షలాది చేపలు, మత్స్యకన్యలు, 6 అడుగుల పొడవు, మనిషి ఆకారంలో 80 కిలోల చేపల రాజు 'అర బాయ్' తదితరాలు ఈ అక్వేరియం లోపల వీక్షించవచ్చు. పర్యాటకులు సముద్ర గర్భంలో నడుచుకుంటూ వెళ్లే అనుభూతి పొందవచ్చు. పాటకు తగినట్లు నృత్యం చేసే రోబోటిక్ కుక్కలు, కోతులు కూడా ఉన్నాయి.. ఇక, 135 అడుగుల ఎత్తులో ఉన్న స్కై రెస్టారెంట్‌లో భోజనం చేయవచ్చు. గృహోపకరణాలు, వంట సామగ్రి కొనుగోలు చేయవచ్చు. పార్కింగ్ సదుపాయం కూడా కల్పించారు. ప్రవేశ రుసుము 5 నుంచి 10 ఏళ్లలోపున్న వారికి రూ.149, పెద్దలకు రూ.199గా నిర్ణయించారు. వారాంతపు రోజుల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు, సెలవు రోజుల్లో ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ అక్వేరియం సందర్శించవచ్చు.

ఇసుక రీచ్‌ల అనుమతులు రద్దుచేయాలి

● పీఎంకే నేత రాందాస్

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నవంబర్ 1న క్వారీలు ప్రారంభించేందుకు ఇచ్చిన అనుమతిని పర్యావరణశాఖ రద్దుచేయాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శనివారం ఇసుక క్వారీలను ప్రారంభించేందుకు నీటిపారుదలశాఖకు పర్యావరణశాఖ అనుమతించడంపై రాందాస్ స్పందించారు. దీనిపై ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 2023లో ప్రారంభించిన 25 ఇసుక క్వారీలు నిబంధనలు అతిక్రమించి 4రెట్లు అధికంగా ఇసుక తవ్వకాలు జరిపి పర్యావరణ పరిరక్షణకు భంగం కలిగిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయని, ఈడీ అధికారులు కూడా 12 ఇసుక క్వారీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఇసుక దందా జరిగినట్లు నిర్ధారించారని తెలిపారు. ఈ నేపథ్యంలో, మళ్లీ రాష్ట్రంలో 8 ఇసుక క్వారీలను ప్రారంభించేందుకు జారీచేసిన ఉత్తర్వులను వెనక్కితీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పీఎంకే యువజన విభాగ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పీఎంకే నేతలు

వేలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)జిల్లా యువజన కార్యవర్గ సమావేశం గురువారం వేలూరులోని పార్టీ కార్యాలయంలో జరిగింది. జిల్లా యువజన విభాగ కార్యదర్శి బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ కేంద్రమంత్రి ఎన్.టీ.షణ్ముగం, రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు గణేష్, జిల్లా యువజన అధ్యక్షుడు రాజా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జగన్, జిల్లా నిర్వాహకులు వెంకటేశన్, శరవణన్ పాల్గొన్నారు.

కలెక్టర్ అధ్యక్షతన ఎస్‌ఐఆర్ సమావేశం

వేలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) పై గురువారం ఉదయం వేలూరు కలెక్టర్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం జరిగింది. కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్ఐఆర్‌పై పార్టీ నేతలకు కలెక్టర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, ఎన్నికల నిర్వాహణ అధికారి ధనుంజయన్, వేలూరు కమిషనర్ లక్ష్మణన్, అధికారి శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిద్రావిడ యువతకు నైపుణ్య శిక్షణ

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజన యువకులకు 'థాడ్కో' ఆధ్వర్యంలో మేకప్, అందం కళలపై శిక్షణ ఇవ్వనున్నారు. 8వ తరగతి నుంచి ప్లస్ టూ చదివిన యువకులు శిక్షణలో పాల్గొనవచ్చు. 18 నుంచి 35 ఏళ్లలోపుండి, కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షలలోపుగా ఉండాలి. 90 రోజుల శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు www.tahdco.com అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవచ్చు.

పంటలు వర్షార్పణం



నీటమునిగిన అరటితోట

వేలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలోని లింగుద్రం గ్రామంలో వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు సుమా రు 50ఎకరాలకు పైగా వరి, వేరుశనగ, అరటి పంటలు దెబ్బతి న్నాయి. ఈ నేపథ్యంలో నెల్లూరుపేట చెరువు సహా మోర్థానా డ్యాంలో నీటి సామర్థ్యం పూర్తిసామర్థ్యానికి చేరుకున్నాయి. దీంతో దిగువ ప్రాంతాలకు అధికారులు నీటిని విడుదల చేశారు. పంటలు నీటి ఉధృతికి కొట్టుకుపోగా, మరికొన్ని పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయని రైతు లు తెలిపారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆ గ్రామంలో పర్యటించిన అధికారుల బృందంతో రైతులు మాట్లాడుతూ, వరద కారణంగా తన పంటలు నీటిపాలయ్యాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని వాపోయారు. నీటమునిగిన పంటలను పరిశీలించి ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

ఈ ఏడాది 229 బాంబు బెదిరింపులు

అంతర్జాతీయ పోలీసుల సాయం కోరిన సైబర్ క్రైం విభాగం

పెరంబూర్,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటివరకు 229 బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ బెదిరింపులు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు సైబర్ క్రైం పోలీసులు అంతర్జాతీయ పోలీసుల సహాయం కోరారు. ఎప్పుడోఒకసారి అనే పరిస్థితిమారి, ప్రతిరోజు బాంబు బెదిరింపులు వస్తున్న పరిస్థితి నెలకొంది. అది కూడా డీజీపీ కార్యాలయానికే ఈ-మెయిల్స్ వస్తున్నాయి. విద్యాసంస్థలు, విమానాశ్రయాలు, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతలు, మంత్రులు, నటీనటులు, పారిశ్రామికవేత్తల ఇళ్లకు బాంబు బెదిరింపులకుపాల్పడుతున్నారు. సచివాలయం, రాజ్‌భవన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాలు కూడా బెదిరింపులకు మినాహాయింపు కాలేదు. బుధవారం అన్నాసాలైలోని అమెరికాదౌత్య కార్యాలయానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ బెదిరింపులతో పోలీసులు తీవ్రంగా శ్రమిస్తుండగా, తనిఖీలు చేపట్టిన ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నగరంలో ఈ ఏడాది ఇప్పటివరకు 229 బాంబు బెదిరింపులు ఈ-మెయిల్ ద్వారా డీజీపీ కార్యాలయానికి వచ్చాయి. అన్ని విదేశాల నుంచి 'డార్క్ వెబ్' అనే వెబ్‌సైట్ వినియోగించి పంపుతున్నారు. దీంతో, బెదిరింపులకు పాల్పడే వ్యక్తులను గుర్తించడంలో పోలీసులకు కఠినంగా మారింది. ఈ కారణంగా, సైబర్ క్రైం పోలీసులు, ఈ వ్యవహారంపై అంతర్జాతీయ పోలీసుల సహకారం తీసుకుని బెదిరింపులకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేయాలని నిర్ణయించారు. కాగా, బాంబు బెదిరింపు ఘటనలకు సంబంధించి తనిఖీలు చేపట్టేందుకు నగరంలో నాలుగు బృందాలు మాత్రమే కాకుండా నాలుగు పోలీసు జాగిలాలు పనిచేస్తున్నాయి.

8 మంది మంత్రులపై అవినీతి ఆరోపణలున్నాయి

● బీజేపీ సీనియర్ నేత తమిళిసై

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం స్టాలిన్ నేతృత్వంలోని మంత్రివర్గంలో 8మందిపై అవినీతి ఆరోపణలున్నాయని బీజేపీ సీనియర్ నాయకురాలు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఆరోపించారు. నందనంలోని ముత్తురామలింగ దేవర్ విగ్రహానికి గురువారం నివాళులర్పించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే మేనిఫెస్టోలో ఉన్న 500లకు పైగా హామీలను స్టాలిన్ ప్రభుత్వం సక్రమంగా నిర్వర్తించలేదని మండిపడ్డారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేఎన్ నెహ్రూ తన బాధ్యతలను విస్మరించి అవినీతిని ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ నాలుగున్నరేళ్లలో సుమారు 8 మంది మంత్రులు భారీస్థాయిలో అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై తగిన సమాధానంలేదన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)జాబితా అమల్లోకి వస్తేనే ఎన్నికల పారదర్శకంగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు.

మేట్టూర్ డ్యాం కాలువలో నిర్జీవంగా తేలిన చేపలు

● మత్స్యకారుల దిగ్భ్రాంతి



కాలువలో తేలుతున్న చేపలు

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూర్ డ్యాం ఓవర్‌ఫ్లో కెనాల్‌లో గురువారం ఉదయం లక్షల సంఖ్యలో చనిపోయిన చేపలు తేలడంతో మత్స్యకారులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. గత 11 రోజులుగా పూర్తిస్థాయిలో నిండిన మేట్టూర్ డ్యామ్‌లో ప్రస్తుతం నీటి మట్టం తగ్గుతోంది. దీంతో క్రష్‌గేట్లను ఇరిగేషన్ అధికారులు మూసివేశారు. ఈ నేపథ్యంలో అదనపు జలాలు ప్రవహించే కాలువలో గురువారం ఉదయం ఉన్నట్టుండి 'అరంజాన్' చేపలు లక్షల సంఖ్యలో చనిపోయి తేలాయి. అదిచూసి స్థానిక మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కాలువలో దుండగులెవరైనా రసాయనాలు చల్లారా? లేక కర్ణాటక నుండి వచ్చే కలుషిత జలాలు కలిసి డ్యామ్ నుండి విడుదలైన జలాలు విషపూరితంగా మారాయా? అని అనుమానిస్తున్నారు.

న్యాయవాదుల భద్రతా చట్టాన్ని అమలుపరచాలి

● జార్జిటౌన్ కోర్టు న్యాయవాదుల సంఘం డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న జార్జిటౌన్ కోర్టు న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సరసముత్తు యాదవ్

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల భద్రతా చట్టాన్ని వెంటనే అమలుపరచాలని జార్జిటౌన్ కోర్టు న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సరసముత్తు యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్యారీస్ ప్రాంతంలోని జార్జిటౌన్ కోర్టులో పనిచేస్తున్న న్యాయవాది సతీష్ ఇటీవల పుళియాన్‌తోపు ప్రాంతంలోని హోటల్‌లో బిరియాని తీసుకుంటున్న సమయంలో పోలీసులు ఆయనను అక్కడినుండి వెళ్లిపోవాలన్నారు. దీనితో వారి మధ్య వాగ్వివాదం జరిగిన నేపథ్యంలో పోలీసులు సతీష్ రెండు సెల్‌ఫోన్లను లాక్కుని ఆయనపై దాడికి పాల్పడినట్లు తెలిసింది. దీనిపై గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా, ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం విధులు బహిష్కరించిన జార్జిటౌన్ కోర్టు న్యాయవాదులు లాయర్లపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలని నినాదాలు చేశారు. న్యాయవాదులపై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజాజీ రోడ్డులో బైటాయించారు. డాక్టర్ అంబేద్కర్ ఆదిఆంధ్ర అరుంధతి యువసేన లీగల్ అడ్వైజర్, జార్జిటౌన్ కోర్టు న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సరసముత్తు యాదవ్, న్యాయవాదులు కేబీ కమల్, సతీష్ సహా న్యాయవాదుల సంఘ నిర్వాహకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సెల్‌ఫోన్ల పంపిణీ



దివ్యాంగులకు సెల్‌ఫోన్లను అందిస్తున్న దృశ్యం

వేలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వేలూరు కలెక్టర్ కార్యాలయంలో గురువారం దివ్యాంగులకు సెల్‌ఫోన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 10 మంది దివ్యాంగులకు రూ.14,495 విలువగల సెల్‌ఫోన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి బాబు, పలుశాఖలకు చెందిన అధికారులు, దివ్యాంగుల సంఘ నిర్వాహకులు పాల్గొన్నారు.

వివాహం ఏర్పాట్లలో తల్లిదండ్రులు

● దంత వైద్యురాలి ఆత్మహత్య

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకునేందుకు ఇష్టంలేని దంతవైద్యురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కళ్లకుర్చి జిల్లాలో చోటుచేసుకుంది. తిరుకోవిలూర్ సంతైపేట సుబ్రమణ్యనగర్ ప్రాంతానికి చెందిన కృష్ణన్ కుమార్తె అమృతవర్షిణి (24) దంత వైద్యురాలిగా పనిచేస్తోంది. ఆమెకు వివాహం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. తనకు ఇప్పుడే వివాహం వద్దని ఆమె కోరినా, తల్లిదండ్రులు ఆమెకు వివాహ ఏర్పాట్లు చేపట్టారు. దీంతో, మనస్తాపం చెందిన అమృతవర్షిణి ఘటన జరిగిన రోజున, ఇంటి మేడ మీద గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న తిరుకోవిలూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

● కాటేసిన కనురెప్ప..

కామాంధుడికి జీవిత ఖైదు

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువాన్మియూర్‌లో కుమార్తెపై అత్యాచారానికి పాల్పడిన కామాంధుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. తిరువాన్మియూర్‌కు చెందిన 38 ఏళ్ల ఆటో డ్రైవర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. గత ఏడాది భార్య పనులకు వెళ్లడంతో, ఇంట్లో ఉన్న ఆటో డ్రైవర్, ఒక కుమార్తెను దుకాణానికి పంపించి, 14 ఏళ్ల మరో కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ దారుణాన్ని బాలిక తల్లికి చెప్పగా ఆమె నీలాంగరై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు ఆ బాలిక తండ్రిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో విచారణ ముగియడంతో, నిందితుడికి జీవిత ఖైదు విధించిన చెన్నై పోక్సో న్యాయస్థానం, బాధితురాలికి రూ.10 లక్షలు, మరో సోదరి, తల్లికి తలా రూ.3 లక్షలు పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేశారు.

లంచం తీసుకున్న కేసులో ఈబీ అధికారులకు రెండేళ్ల జైలు

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్త ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.7,500 లంచం తీసుకున్న విద్యుత్ బోర్డు (ఈబీ) అధికారులకు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. తిరునల్వేలి ఎన్‌జీఓ కాలనీకి చెందిన గోమతినాయకం 2009లో కొత్త ఇల్లు నిర్మించుకున్నాడు. ఆ ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు పెరుమాళ్‌పురం విద్యుత్ బోర్డు ఏఈఈ శివకుమార్, అసిస్టెంట్ ఉదయకుమార్‌లను సంప్రదించగా, వారు రూ.7,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని గోమతినాయగం జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులకు తెలియజేశారు. అధికారుల సూచనలతో ఇంజనీర్ శివకుమార్, అసిస్టెంట్ ఉదయకుమార్‌లకు గోమతినాయగం నగదు అందిస్తుండగా, అక్కడే మాటువేసిన అధికారులు, వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసు విచారణ ముగిసిన నేపథ్యంలో, శివకుమార్, ఉదయకుమార్‌లకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.10వేలజరిమానా విధిస్తూ తిరునల్వేలి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సుబ్బయ్య బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

పంట కాలువలో మొసలి



పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సిరుకాడు ప్రాంతంలోని పంట కాలువలో మొసలిని గమనించిన రైతులు భయాందోళనలు చెందారు. మేట్టూరు డ్యాం నుంచి విడుదల చేసిన సాగునీరు, తిరుచ్చి జిల్లా పెట్టవైతలై ప్రాంతంలో కాలువ ద్వారా సరఫరా చేస్తున్నారు. సిరుకాడు ప్రాంతంలోని పంట కాలువలో సుమారు ఏడడుగుల మొసలిని గమనించిన రైతులు, పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.. అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని మొసలిని బంధించి కొల్లిడం జలాశయంలో వదిలిపెట్టారు. మేట్టూరు డ్యాం నుంచి విడుదల చేసిన నీటితో మొసలి కొట్టుకువచ్చి ఉంటుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

పరీక్షలో ఫెయిల్: మెడికో ఆత్మహత్య



నిషాంత్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సెమిస్టర్ పరీక్షలో ఫెయిల్ కావడంతో, వైద్య విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాంచీపురం జిల్లాలో చోటుచేసుకుంది. కోట్టూరు ప్రాంతానికి చెందిన వేల్‌మురుగన్ కుమారుడు నిషాంత్ (22) నాగపట్టణం ఒరత్తూర్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. నిషాంత్ ఆ ప్రాంతంలో హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇటీవల జరిగిన సెమిస్టర్ పరీక్షల్లో ఓ సబ్జెక్ట్‌లో నిషాంత్ ఫెయిలయ్యాడు. అప్పటినుంచి మనస్తాపంతో ఉన్న నిషాంత్, మంగళవారం రాత్రి గదిలోకి వెళ్లి బుధవారం ఉదయం ఎంత వరకు బయటకు రాకపోవడంతో అనుమానించిన సహచర విద్యార్థులు లోనికి వెళ్లి చూడగా, ఫ్యానుకు ఉరేసుకుని ఉండడం గమనించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగం పేరిట రూ.5లక్షల మోసం

వేలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5లక్షలు తీసుకొని మోసం చేశారని ఓ తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా.. 10వ తరగతి పాసైన తన కుమారుడు ప్రదీప్ రాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించిన తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తమ దగ్గర రూ.5లక్షల నగదు తీసుకొని పరారయ్యాడని జిల్లా కాట్పాడి సమీపంలోని వేపంకాల్‌కు చెందిన గోవిందస్వామి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

దేవర్ స్మారక మందిరంలో పూజారిపై దాడి


● శ్రీధర్ వాండయార్‌పై ఫిర్యాదు

ప్యారీస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ స్మారక మందిరంలో గురువారం జరిగిన గురుపూజలో పూజారులపై దాడికి పాల్పడిన మూవేందర్ మున్నేట్ర కళగం (ఎంఎంకే) అధ్యక్షుడు శ్రీధర్ వాండయార్‌పై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. గురుపూజలో నలుగురు పూజారులు పాల్గొనగా, హఠాత్తుగా నివాళులర్పించేందుకు వెళ్లిన వాండయార్‌ను పక్కకు వెళ్లి నిలబడాలని సూచించారు. అందుకు ఆగ్రహించిన వాండియార్ ఓ పూజారిపై చేయిచేసుకున్నాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది.

పోలీసుల అదుపులో శ్రీలంక వాసులు

పెరంబూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో చట్టవిరుద్ధంగా బసచేస్తున్న శ్రీలంకకు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు, వారిని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. మన్నడి ప్రాంతంలో శ్రీలంకకు చెందిన వారున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు బుధవారం ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఓ హోటల్‌లో బసచేస్తున్న శ్రీలంకకు చెందిన ఇసైవేందన్ (26), యోగరాజా (26), సుజీవన్ (30) తదితరులను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు 15 రోజుల క్రితం చట్టవిరుద్ధంగా పడవలో రాష్ట్రానికి వచ్చినట్లు తెలిసింది. వీరిపై శ్రీలంకలో మాదకద్రవ్యాల అక్రమ తరలింపు కేసులున్నాయని, నిషేధిత ఎల్టీటీఈ సంస్థతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని విచారణలో తెలిసింది. ముగ్గురి గురించి శ్రీలంక దౌత్యకార్యాలయానికి పోలీసులు సమాచారం అందించారు. ఆ కార్యాలయం విజ్ఞప్తి మేరకు, ముగ్గురిని శ్రీలంకకు పంపేందుకు కస్టమ్స్ అధికారులు పోలీసులకు అప్పగించారు.

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పథకాలపై ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న అధికారులు

వేలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించేలా వేలూరు జిల్లా గుడియాత్తం పరిసర పంచాయతీల్లో గురువారం ఫొటో ఎగ్జిబిషన్ జరిగింది. పంచాయతీ అధ్యక్షుడు జయశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ ఎగ్జిబిషన్‌లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు సంబంధించిన పథకాలకు సంబంధించిన ఫొటోలను తిలకించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉపాధ్యక్షుడు సతీష్, కార్యదర్శి సురేష్‌బాబు సహా పలుశాఖ అధికారులు పాల్గొన్నారు.



లోకేష్ కనకరాజ్ సరసన వామికా గబ్బి

'రాకీ', 'కెప్టెన్ మిల్లర్' వంటి విజయవంతమైన చిత్రాలను రూపొందించిన డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో మరో యంగ్ అండ్ డైనమిక్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ హీరోగా నటించనున్నారు. ఈ మూవీలో బాలీవుడ్ హీరోయిన్‌గా వామికా గబ్బిని ఎంపిక చేశారు. తమిళంలో 'మాలై నేరత్తు మయక్కం' అనే చిత్రం ద్వారా వామికా కోలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. అలాగే రవి మోహన్ హీరోగా రూపొందుతోన్న 'జీని' మూవీలోనూ ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇదిలావుండగా ఈ చిత్రం కోసం లోకేష్ కనకరాజ్ తన సినిమా కోసం పలురకాల శిక్షణ కూడా పొంది షూటింగులో పాల్గొంటున్నారు. ఇప్పటికే ఈ చిత్రం చిత్రీకరణ పనులు చెన్నైలో శరవేగంగా సాగుతోంది.

తొమ్మిదేళ్ళ తర్వాత 'జూటోఫియా-2'



వాల్ డిస్నీ నిర్మించిన అనిమేషన్ మూవీ 'జూటోఫియా'కు రెండో భాగం తొమ్మిదేళ్ళ తర్వాత విడుదలకానుంది. 2016లో వచ్చిన ఈ చిత్రం తొలి భాగం ఆస్కార్ అవార్డు గెలుచుకుంది. ఇపుడు ఈ సినిమా రెండోభాగం చిత్రీకరణ ఎపుడో పూర్తయినప్పటికీ విడుదల మాత్రం వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ చిత్రాన్ని వచ్చే నెల 28న విడుదల చేయనున్నట్టు నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడించింది. తొలిభాగంలో చిన్నారులను అమితంగా ఆకర్షించిన పోలీస్ ఉన్నతాధికారిగా నటించిన జూడి హాప్స్, నిక్ వైల్డ్ తదితరులు ఈ చిత్రంలో తమ ధైర్యసాహసాలను ప్రదర్శించనున్నారు. వీరిద్దరూ కేరీ డిస్నేక్‌తో కలిసి నటించారు. తొలి భాగాన్ని తెరకెక్కించిన జారెట్ బుష్, బైరన్ హోవర్డ్ ద్వయం దర్శకత్వం వహించారు.

కోవై నేపథ్యంలో 'రెడ్ లేబుల్'

● ఫస్ట్‌లుక్ రిలీజ్ చేసిన సిమ్రన్

కోయంబత్తూరు నేపథ్యంలో కాలేజీలో జరిగే హత్య, తదనంతర పరిణామాల ఇతివృత్తంతో 'రెడ్ లేబుల్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. పొన్. పార్తిబన్ అందించిన కథతో కె.ఆర్.వినోద్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రెవ్‌జెన్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత లెనిన్ నిర్మించారు. చిత్రీకరణ కోయంబత్తూరులో జరుగుతోంది. లెనిన్, అస్మిన్ హీరోహీరోయిన్లుగా నటించగా, సీనియర్ దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్ ఒక ముఖ్య పాత్రలో, మునీష్‌కాంత్ గెస్ట్ అప్పీరెన్స్‌గా కనిపించనున్నారు. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను సీనియర్ నటి సిమ్రన్ తాజాగా విడుదల చేశారు. ఈ మూవీ టైటిల్ గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'సాధారణంగా రెడ్ లేబుల్ అనగానే టీ కంపెనీ లేదా మద్యం బ్రాండ్ పేరో గుర్తుకొస్తుంది. తాము పెట్టిన ఈ టైటిల్‌కు ఈ రెండూ కావు. రెడ్ అంటే విప్లవం. లేబుల్ అంటే గుర్తు. గుర్తింపు కోసం శోధించే అనేక మంది కథే ఇది' అని పేర్కొన్నారు.



'రెడ్ లేబుల్' మూవీ ఫస్ట్‌లుక్

చిత్రజ్యోతి

వాటికన్నా..అశ్లీల చిత్రాలే మంచివి!

● దర్శకుడు పేరరసు

సంస్కృతి సంప్రదాయాలను నాశనం చేసే చిత్రాల కంటే అశ్లీల సినిమాలు ఎంతో బెటర్ అని ప్రముఖ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు అభిప్రాయపడ్డారు. ఆరుపడై ప్రొడక్షన్ బ్యానరుపై శంకర్ సారథి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వల్లువన్' చేతన్ సీను, ఆస్నా జవేరి, సాయిదీనా, దీపా, కరాటే రాజా తదితరులు నటించారు. ఈ మూవీ ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక నగరంలో తాజాగా జరిగింది. ఈ ఆడియో వేడుకలో సినీ ప్రముఖులు పేరరసు, ఆర్వీ ఉదయకుమార్, ఆర్‌కే సెల్వమణి, రాధా భారతి, నటులు కరాటే రాజా, భరత్, విజయ్ విశ్వ, నిర్మాతలు కేఎస్ రాజన్, పీఎల్ తేనప్పన్, చిత్ర నిర్మాత శైల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పేరరసు ఆడియోను రిలీజ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రసంగించారు. ' తమిళంలో మూవీ టైటిల్ పెట్టినందుకు దర్శకుడిని అభినందిస్తున్నాను. నేటికాలంలో తిరువళ్ళువర్ జీవించివున్నట్టయితే ఆయన కలానికి బదులు కత్తి లేదా తుపాకీ పట్టుకుని వుండేవారు. అధికార మార్పిడి జరిగినపుడల్లా ఇతర అంశాల్లో మార్పులు జరుగుతాయో లేదో గానీ బస్సుల రంగులు మాత్రం మారుతాయి. పాత కాలంలో గొప్ప వ్యక్తుల పేర్లకు ముందు వారి సొంతూరు ఉండేది. అయితే, వళ్ళువర్ మాత్రమే ఊరి పేరు వదిలిపెట్టారు. దర్శకుడు శంకర్ సారధికి గుండె ధైర్యం ఎక్కువ. అందుకే ఈ చిత్రంలో న్యాయమూర్తిని కొనేద్దాం అంటూ ఒక అడ్వకేట్ చెప్పే డైలాగ్ ఉంది. ఒక దర్శకుడుకి ప్రజలపై, సమాజంపై బాధ్యత ఉండాలి. దర్శకుడు యాక్షన్, కామెడీ, ఫ్యామిలీ, కులం, థ్రిల్లర్ ఎలాంటి చిత్రాలైనా తీయొచ్చు. కానీ, అందరి లక్ష్యం మాత్రం ఒక్కటిగానే ఉండాలి. మంచి సందేశం చెప్పాలి. సంస్కృతీ సంప్రదాయాలను నాశనం చేసే సినిమాల కంటే అశ్లీల చిత్రాలు ఎంతో మేలు. డబ్బు సంపాదించేందుకు అనేక మార్గాలున్నాయి. దర్శకుడు ఒక ఆధ్యాత్మిక వాది కావడంతో మంచి సినిమా తీసి ఉంటారని గట్టిగా నమ్ముతున్నాను' అని పేరరసు పేర్కొన్నారు.


'వల్లువన్' ఆడియో రిలీజ్

రామాయణంతో ముడిపడిన ప్రదేశం

దశరథుడు యాగం చేసిన క్షేత్రం

● సంతాన భాగ్యం కలిగించే పుత్రకామేష్టీశ్వరాలయం

రామాయణంతో ముడిపడి ఉన్న వివిధ ప్రదేశాలు రాష్ట్రంలో ఉన్నాయి. దశరథుడు పుత్ర కామేష్టి యాగం చేశాడని రామాయణం చెబుతోంది. ఆ అద్భుత సంఘటన జరిగిన ప్రదేశం రాష్ట్రంలోనే ఉందని జ్ఞాన సంబంధిత గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఆ దివ్య క్షేత్రం గురించి, ఆ క్షేత్రంలో దశరథుడికి సంతానం కల్పించి అనుగ్రహించిన పుత్రకామేష్టీశ్వరుడి గురించి తెలుసుకుందాం. తిరువణ్ణామలై నుంచి సుమారు 60 కి.మీ. దూరంలో ఆరణి సమీపంలో పుదుక్కామూర్ అనే గ్రామంలోకి ప్రవేశిస్తున్నప్పుడే ఓ వాగు వంతెనకు ఎడమవైపు పుత్రకామేష్టీశ్వర ఆలయం దర్శనమిస్తుంది.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి


ఆధ్యాత్మికం
ఆలయరాజగోపురం


స్వామివారి నామధేయం : పుత్రకామేష్టీశ్వరుడు
ఉత్సవమూర్తి నామధేయం : సోమస్కంధర్
అమ్మవారి నామధేయం : పెరియనాయకి తాయార్
స్థల వృక్షం : పారిజాత వృక్షం
తీర్థం : కమండల తీర్థం


అమ్మవారి సన్నిధి

వరమైన శాపం...

దశరథుడు అంటే పది దిక్కులా రథాన్ని నడిపించగల సామర్థ్యం కలిగినవాడని అర్థం. అలాంటి దశరథుడు చాలా కాలం వరకూ సంతానం లేక సతమతమవుతుండేవాడు. దశరథుడు అడవిలో వేటకు వెళితే జంతువుల సంచార శబ్దాన్ని విని, వాటి దిశగా బాణాలను సంధించగల సత్తా కూడా కలిగిఉండేవాడు. ఆ మేరకు ఓ పర్యాయం అడవిలో వేటకు వెళ్లినప్పుడు నదీ తీరంలో ఓ జంతువేదో నీటిని తాగుతున్న శబ్దం వినిపించింది. ఆ శబ్దం వచ్చిన దిశగా దశరథుడు బాణం సంధించాడు. ఆ బాణం అడవి మృగానికి బదులు ఓ యువకుడికి తగిలింది.. ఆ యువకుడు నదిలో నీరుపడుతుండగా అడవి జంతువు నీటిని తాగుతున్నట్లు భావించి బాణాన్ని ప్రయోగించినట్లు తెలుసుకుని దశరథుడు క్రుంగిపోయాడు. దశరథుడి బాణానికి నేలకొరిగిన శ్రవణుడు. అంధులైన తల్లిదండ్రులకు సేవలు చేస్తూ తీర్థయాత్రలకు తీసుకెళుతున్నాడని దశరథుడు తెలుసుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న శ్రవణుడిని అతడి తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్ళాడు. కాసేపటికి శ్రవణుడు కన్నుమూశాడు. విషయం తెలుసుకుని విలపించిన శ్రవణుడి తల్లిదండ్రులు... తామెలా పుత్రశోకానికి గురై మృత్యువాత పడనున్నామో అలాగే దశరథుడు కూడా పుత్రశోకానికి గురై మరణిస్తాడని శాపమిచ్చి వారిద్దరూ ప్రాణత్యాగం చేశారు. ఆ వృద్ధదంపతులు తనకు పుత్రశోకం వల్ల మరణం సంభవిస్తుందరంర మాటలు గుర్తుకు వచ్చి సంతోషంతో పొంగిపోయాడు. తనకు తప్పకుండా సంతానం కలుగుతుందని తెలుసుకుని ఆనందంతో నగరానికి తిరిగొచ్చి వశిష్ట మహర్షిని పిలిచి సంతానం కోసం చేయాల్సిన యాగాలు, పూజలు నిర్వహించాలని కోరారు. వశిష్టమహర్షి తూర్పు దిశ నుంచి ఉత్తర దిశగా మళ్లే నదీ తీరాన ఓ శివాలయం నిర్మించి, ఆ క్షేత్రంలో పుత్రకామేష్టి యాగం నిర్వహిస్తే పరమేశ్వరుడి అనుగ్రహం వల్ల సంతానం కలుగుతుందని తెలిపారు. వశిష్ట మహర్షి చెప్పినట్లే దశరథుడు దేశంలో సంచరిస్తూ దక్షిణ భారతంలో కమండల నది తూర్పు నుండి ఉత్తరదిశగా ప్రవహిస్తున్నట్లు గుర్తించి, ఆ నదీ తీరంల్లో అద్భుతమైన ఆలయాన్ని నిర్మించి ఆ క్షేత్రంలోనే పుత్రకామేష్టి యాగం చేశాడు. ఆ యాగఫలంగా దశరథుడికి సంతానం కలిగింఇ.. రాముడి జననానికి కారణమైన ఆ ఆలయమే ఆరణిలో ఉన్న పుత్రకామేష్టీశ్వరాలయం అని స్థలపురాణం చెబుతోంది.


దశరథమహారాజు - చండికేశ్వర్లు - వీరభద్రుడు - మహావిష్ణువు - పెరియనాయకి తాయార్



ఎలావెళ్ళాలి?... : రాజధాని నగరం చెన్నై సహా పలు నగరాల నుండి ఆరణికి బస్సులు నడుపుతున్నారు. ఆరణి నగరంలో దిగిన తర్వాత టౌన్ బస్సులు, ఆటోలో పుదుక్కామూరు పుత్రకామేష్టీశ్వరాలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 7 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4.30 నుండి రాత్రి 7.30 గంటల దాకా తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.


కాలభైరవుడు, నటరాజస్వామి

ఆలయ విశేషాలు...

ఈ ఆలయంలో ఆరుద్రదర్శనం, మహాశివరాత్రి, పంగుణి ఉత్తిరం, లక్ష దీపం, నాగ చతుర్థి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. తైపొంగల్ (మకర సంక్రాంతి) రోజున ఈ ఆలయంలో జరిగే 'ఆట్రుపడి తిరువిళా' ప్రఖ్యాతి గడించింది. ఈ ఆలయంలో వివాహితులు సంతానం కోసం ఆరు సోమవారాలపాటు స్వామి, అమ్మవార్లను నిష్ఠతో దర్శించి, రెండేళ్లలోపు బాల బాలికలకు అన్నదానం చేసి, చివరి సోమవారం గర్భాలయంలో స్వామివారికి పెరుగుతో అభిషేకం, పొంగలి నైవేద్యం సమర్పిస్తారు. ఆరు సోమవారాలపాటు ఈ వ్రతమాచరించిన ఎంతో మందికి సంతానం కలిగినట్లు ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు.

ఆలయ వైభవం...

ఈ ఆలయం చేరువగా నదీ తీరాన ఉత్తరదిశగా వినాయకుడికి, దక్షిణదిశగా ఆంజనేయుడికి ప్రత్యేక మదిరాలున్నాయి. జమ్మి వృక్షం కింద నాగదేవతల విగ్రహాలున్నాయి. రాజగోపురానికి ఎదురుగా ప్రత్యేక సన్నిధిలో దశరథుడి విగ్రహం ఉంది.. పల్లవుల కాలం నాటి శిల్ప కళలను చాటేలా నిర్మితమైన ఈ ఆలయ గర్భాలయం గోష్ఠంలో నర్తన గణపతి, దక్షిణామూర్తి, మహావిష్ణువు, బ్రహ్మదేవుడు, చండికేశ్వర్లు, దుర్గాదేవి దర్శనమిస్తారు. ఈ దేవతా మూర్తులే కాకుండా నటరాజస్వామి, వీరభద్రస్వామి, కాళికాదేవి, ఇష్టదేవేరులతో మురుగప్పెరుమాన్, శ్రీకృష్ణుడు, సహస్ర లింగేశ్వరుడు, రేణుకాదేవి, నవగ్రహాలు, ప్రాకారంలో అరుపత్తు మూవర్ (63 మంది నాయన్మార్లు) కూడా ఉన్నారు. శనీశ్వరుడు, సూర్యభగవానుడికి ప్రత్యేక సన్నిధులున్నాయి. గర్భాలయంలో పుత్రకామేష్టీశ్వరుడు లింగాకారంలో పూజలందుకుంటున్నారు. మరో సన్నిధిలో అమ్మవారైన పెరియనాయకి తాయార్ కోరిన వరాలిచ్చే కరుణామూర్తిగా కొలువై ఉన్నారు.


పుత్రకామేష్టీశ్వరుడు

వైభవంగా దేవర్ జయంతి వేడుకలు

● ఘనంగా నివాళులర్పించిన నేతలు


దేవర్ స్మారకస్థలం వద్ద నివాళులర్పిస్తున్న ఎండీకే నేత వైగో తదితరులు

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ 118వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మంత్రులు, అన్నాడీఎంకే తరఫున ఆ పార్టీ సీనియర్ నేతలు, టీఎంసీ నేతలు దేవర్ జయంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందనం కూడలి వద్దనున్న దేవర్ విగ్రహాన్ని పూలతో అలంకరించారు. విగ్రహం దిగువన ఆయన చిత్రపటం ఉంచి పూలమాలలు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు సామినాదన్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మెయ్యనాథన్, ఎంపీ టీఆర్‌బాలు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, శాసనసభ్యులు డి.వేలు, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అధ్యక్షుడు పూచ్చి మురుగన్ తమిళభాషాభివృద్ధి సమాచార శాఖ కార్యదర్శి వి అముదవళ్ళి, తదితరులు పాల్గొని దేవర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అన్నాడీఎంకే ఆధ్వర్యంలో నందనంలోని దేవర్ విగ్రహానికి ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రులు డి.జయకుమార్, వలర్మతి, గోకుల ఇందిరా, ఎంపీ తంబిదురై పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమిళ మానిల కాంగ్రెస్ తరపున ఆ పార్టీ ప్రముఖులు జీఆర్ వెంకటేష్ తదితరులు దేవర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇదే విధంగా పనయూరులోని టీవీకే ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ నేత విజయ్ పసుంపొన్ దేవర్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. రామనాథపురం జిల్లా పసుంపొన్ గ్రామంలోని దేవర్ స్మారక స్థలం వద్ద పలు రాజకీయ పార్టీల నేతలు నివాళులర్పించారు. ఎండీఎంకే ఆధ్వర్యంలో పార్టీ నేత వైగో, శాసనసభ్యుడు భూమినాథన్, పార్టీ జిల్లా శాఖ కార్యదర్శి మునియసామి, మహమ్మద్ తదితరులు దేవర్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్, ఎండీఎంకే నేత వైగో ఆప్యాయంగా పలకరించుకుంటూ దేవర్ స్మారక స్థలం వద్దకు వెళ్ళి నివాళులర్పించారు. ఆ సందర్భంగా వైగో మాట్లాడుతూ సీమాన్‌తో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, తన మాతృమూర్తి మృతి చెందిన సమాచారం తెలుసుకుని ఆగమేఘాలపై వచ్చి పరామర్శించారని తెలిపారు. తమిళ సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు పాటుపడుతున్న సీమాన్ సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.


నివాళులర్పిస్తున్న ఓపీఎస్, సెంగోటయ్యన్, టీటీవీ దినకరన్


మదురై గోరిపాళయంలో దేవర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తదితరులు


కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోవిల్‌లో దేవర్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి


నందనంలోని దేవర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీఎంసీ నేత జీఆర్ వెంకటేష్ తదితరులు


నందనం సిగ్నల్ వద్ద దేవర్ విగ్రహం దిగువనున్న ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు ఎం. సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, సామినాథన్, ఎంపీ టీఆర్ బాలు తదితరులు


పనయూరులోని పార్టీ కార్యాలయంలో దేవర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న టీవీకే నేత విజయ్

'హాయ్ లైఫ్' ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన


ప్రదర్శన ప్రారంభిస్తున్న ప్రముఖులు

అడయార్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలోని హయత్ రీజెన్సీలో 'హాయ్ లైఫ్' పేరుతో ఏర్పాటైన ప్రత్యేక ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. బుధ, గురు వారాల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనను కంటెంట్ క్రియేటర్, ఈవెంట్ అడ్వయిజర్ సాయిలక్ష్మి సంజయ్, నటి ఉపాసన, అంతర్జాతీయ మోడల్ నమితా మారిముత్తు, పారిశ్రామికవేత్త శ్వేతా రేణుకుమార్ తదితరులు ప్రారంభించారు. 150 మందికి పైగా డిజైనర్లను ఒకే వేదికపై తీసుకొచ్చిన ఈ ప్రదర్శన ఫ్యాషన్, లగ్జరీ, స్టయిల్‌తో అద్భుతంగా సాగినట్లు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. హాయ్ లైఫ్ ఎగ్జిబిషన్ ఎండీ అబి డొమినిక్ మాట్లాడుతూ.. ప్రతి సీజన్‌లోనూ చెన్నైతో తమ అనుబంధం బలపడుతోందని, ఈ ఎడిషన్ ఫ్యాషన్, జీవనశైలి, చక్కదనం యొక్క అద్భుతమైన మిశ్రమాన్ని తెచ్చిందని వివరించారు.

'సీక్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో సహాయాల పంపిణీ


సహాయాలు అందజేస్తున్న డాక్టర్ విమల బ్రిట్టో, నిర్వాహకులు

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'సీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీలగిరి జిల్లా కోతగిరి, గూడలూరు ప్రాంతాలకు రెండు అంబులెన్స్‌లు, లోడు వాహనం, పలువురికి టైలరింగ్ మెషీన్లు అందజేశారు. నగరంలోని సెయింట్ బ్రిట్టో అకాడమీ (ఎస్‌బీఏ)లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ విమల బ్రిట్టో పాల్గొన్నారు. ఫౌండేషన్ తరఫున నీలగిరి ఆదివాసీ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎన్ఏడబ్ల్యూఏ) సెక్రటరీ అల్వాస్‌కు సుమారు రూ.50 లక్షల విలువైన సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ థామస్ పౌన్‌రాజ్, ఎస్‌బీఏ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విమల బ్రిట్టో మాట్లాడుతూ... తమ సంస్థ సామాజిక సేవలో భాగంగా ఈ సహాయాలు చేస్తున్నామన్నారు. మనం చేసే చిన్న సహాయం కూడా సమాజాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆమె తెలిపారు.


చెన్నై నుంగంబాక్కం స్టేడియంలో గురువారం ప్రారంభమైన చెన్నై ఓపెన్ ఇంటర్నేషనల్ ఉమెన్స్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీలను ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చుని వీక్షిస్తున్న క్రీడాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వరిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి


మదురైలో బుధవారం రాత్రి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఎంపీ కనిమొళి


ముందుచూపుతోనే తక్కువ నష్టంతో బయటపడ్డాం

● ఎంపీ సీఎం రమేష్


బీటెక్ రవి, సీఎం రమేష్

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందుచూపుతో మొంథా తుపాను నుంచి చాలా తక్కువ నష్టంతో బయటపడ్డామని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, కుటుంబ సభ్యులతో కలిసి ఆయన గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎక్కడికక్కడ అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. అంతకు ముందు ఆయన శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

'అఖండ2' మ్యూజిక్ కొంత పూర్తయింది



● డ్రమ్స్ శివమణి

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ 'అఖండ2' సినిమాకు సంబంధించి బ్యాగ్రౌండ్ మ్యూజిక్ కొంతమేరకు పూర్తయిందని డ్రమ్స్ కళాకారుడు శివమణి తెలిపారు. గురువారం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ సినిమాలో తనకు అవకాశం కల్పించిన సంగీత దర్శకుడు తమన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తిరుమలలో మంచి దర్శనాలు చేయిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,048

తలనీలాలు సమర్పించినవారు: 19,838







కదిలొచ్చిన పూలవనం

తొమ్మిది టన్నుల పుష్పాలతో అభిషేకం

చామంతి, సంపంగి, రోజాలు, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, మాను సంపంగి, కలువ, మనోరంజితం, పారిజాతం, వృక్షి, సెంటుజాజి, మొగలి రేకులు, నిత్య మల్లె.. ఇలా 16 రకాల పూలు, ఐదు రకాల పత్రాలు.. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీనివాసుడి సేవలో తరించాయి. పుష్పయాగం సందర్భంగా గురువారం తిరుమల ఆలయంలో ఉత్సవమూర్తుల హృదయాల దాకా పూలు నిండిపోయాయి. ఉదయమే ఆలయానికి పూలబుట్టలు బారులు తీరాయి. పుష్పవనమే తరలి వస్తున్నట్టుగా ఆ దృశ్యం కనిపించింది. తమిళనాడు నుంచి ఐదు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఏపీ నుంచి రెండు టన్నుల చొప్పున మొత్తం 9 టన్నుల పూలను పుష్పాభిషేకం కోసం తెప్పించారు. తులసి, మరువం, దవణం, బల్వం, పన్నీరు, కదిరిపచ్చలనూ పుష్పయాగంలో అర్చనకు వినియోగించారు. బ్రహ్మోత్సవాల సమయంలో తెలియక జరిగే దోషాల నివారణకు కార్తీకమాసంలో వచ్చే శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణానక్షత్రంలో పుష్పయాగాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అంతకుముందు స్నపన తిరుమంజనం జరిగింది. కాగా, ఈ పూలను దాతల ద్వారా సమకూర్చడంలో విశేష కృషి చేసిన గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులను ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం శాలువాతో సత్కరించారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి







ఆర్టీసీలో 705మంది ఉద్యోగులకు పదోన్నతి

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల కలనెరవేరినసంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 705 మందికి పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన వారి జాబితా శుక్ర లేదా శని వారాల్లో డీపీటీవో జగదీష్ ప్రకటించనున్నారు. 281 మంది గ్రేడ్-1 డ్రైవర్లుగా,130మంది గ్రేడ్-1 కండక్టర్లుగా,111మంది ఏడీసీ టెక్నికల్ కంట్రోలర్‌గా,46 మంది డీసీలుగా,28మంది ఎల్‌హెచ్‌లుగా,45మంది గ్రేడ్ 1 మెకానికల్‌గా,6 మంది గ్రేడ్ 1టిమ్మర్లుగా,8మంది గ్రేడ్ 1పెయింటర్లుగా,4మంది గ్రేడ్ 1 వెల్డర్లుగా,6మంది గ్రేడ్ 1బ్లాక్‌స్మిత్‌గా,8మంది హమ్మర్‌మెన్స్‌గా.32మంది డిప్యూటీ మెకానికల్స్‌గా పదోన్నతి పొందినట్లు సమాచారం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 డిపోల్లో దాదాపు 6వేలమంది పనిచేస్తున్నారు. వీరిలో ఒకేసారి 705మందికి పదోన్నతి లభించడంపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో దాదాపు వంద మంది పదోన్నతి పొందకుండానే రిటైరయ్యారని ఈ సందర్భంగా ఉద్యోగులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రమోషన్ పొందిన వారికి మరోచోట పోస్టింగ్ ఇచ్చే అవకాశముంది. దీంతో కొన్ని ఖాళీలు ఏర్పడతాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

9దాకా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు

తిరుపతి(విద్య), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు నవంబర్ 9వ తేదీ వరకు గడువు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 18వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వయసును బట్టి 4 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఈ పరీక్షకు అర్హత ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష విధానం గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు 86888 88802, 93999 76999లలో తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ - నవోదయ పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

తిరుపతి రైల్వేస్టేషన్ పనుల్లో వేగం పెంచండి:డీఆర్ఎం

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా ఆదేశించారు. గురువారం ఆయన తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను తనిఖీ చేశారు. దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనంలో రన్నింగ్ స్టాఫ్, ప్రయాణికుల కోసం నిర్మించిన గదుల్లో మౌలిక వసతులను పరిశీలించారు. నిర్ణీత సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టాల్స్ నిర్వహణ గురించి క్షేత్రస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఈ సూర్య నారాయణ, అధికారులు యూ.సుధాకర్, శ్రావణ్ కుమార్, మణికంఠ, మనోజ్‌కుమార్, స్టేషన్ మేనేజరు కె.చిన్నపరెడ్డి, దరూరు ప్రభాకర్, మాధవరావు, ఐపీఎఫ్ సందీప్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు. అనంతరం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.

నూతన కమిటీతో వేదపారాయణదారుల నియామకాలు

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): టీటీడీ వేదపారాయణదారుల పోస్టుల భర్తీకి నవంబరు 10వ తేదీన ఇంటర్వ్యూలు జరుగనున్నాయి. ఈమేరకు ముగ్గురు సభ్యులతో కూడిన నూతన కమిటీ ఈ ఇంటర్వ్యూలను నిర్వహించనుంది. దాదాపు 700 మంది వేదపారాయణదారుల పోస్టుల భర్తీకి గతంలో టీటీడీ అంగీకారం తెలిపిన నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర బ్రాహ్మణులకు నష్టం కలిగేలా, తమిళనాడువాసులకు లబ్ధిచేకూరేలా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ ఇంటర్వ్యూలు జరగకుండా టీటీడీ బోర్డు, అధికారులు నిర్ణయం తీసుకోవడంతో గత నెలలో భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. పాత కమిటీలోని వారిని తొలగించిన టీటీడీ.. తాజాగా మరో ముగ్గురు సభ్యులను నియమించి పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఆదేశించింది. ఇప్పటికే ఫైనల్ చేసిన దరఖాస్తుదారులకు కాల్‌లెటర్లు పంపారు. దరఖాస్తుల స్వీకరణ సమయంలోనే రాష్ట్ర బ్రాహ్మణులను తొలగించారని, గత అధికారులు ఎంపిక చేసిన తమిళనాడు వాసుల దరఖాస్తులను స్వీకరించి నూతన కమిటీతో ఇంటర్వ్యూలు చేయించినా రాష్ట్ర బ్రాహ్మణులకు న్యాయం జరగదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై టీటీడీ అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.

తిరుమల తర్వాత కాణిపాకం రండి :ఎమ్మెల్యే మురళి

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులందరూ కాణిపాక వినాయకస్వామి ఆలయాన్ని కూడా దర్శించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కాణిపాకంలో వసతి సముదాయం, కల్యాణవేదికల నిర్మాణం కోసం రూ.25 కోట్లు కేటాయించిన టీటీడీ చైర్మన్, సభ్యులు, ఈవో, అదనపు ఈవోలకు ధన్యవాదాలు తెలిపారు.

ఏడేళ్లుగా పరిశ్రమల కోసం ఎదురు చూపులు

● 80కి పైగా ఏర్పాటు చేస్తామన్న మంత్రి

● అమలుకు నోచుకోక నిరాశలో ప్రజలు



ఏపీఐఐసీ బోర్డు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు, కొత్తపాళెం, భవానీశంకరపురంతోపాటు తొట్టంబేడు మండలం రౌతుసూరమాల గ్రామాల ప్రజలు పరిశ్రమల కోసం ఎదురు చూస్తున్నారు.


ఏపీఐఐసీకి కేటాయించిన భూమి

2017లో ఈ నాలుగు గ్రామాల నుంచి ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా 2095 ఎకరాల భూములను సేకరించింది. గత ప్రభుత్వంలో ఈ భూములకు సంబంధించిన భూపరిహారాన్ని రైతులకు చెల్లించింది. వివిధ కారణాలతో కొంత మందికి చెల్లించలేదు. ఈ భూములకు లింక్ రోడ్డు నిర్మాణాలు, నాయుడుపేట హైవేకు ఆరులేన్ల రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. భూములు శరవేగంగా తీసుకున్న అధికారులు ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాకపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పడంతో ఈ ప్రాంతంలో కూడా పరిశ్రమలు నెలకొల్పుతారన్న ఆశతో ఉన్నారు. గత సంవత్సరం ఆగస్టులో రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ యువరాజ్ ఏపీఐఐసీ భూములను సందర్శించి, త్వరితగతిన భూములను అభివృద్ధి చేసి పరిశ్రమలు స్థాపిస్తామని చెప్పారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏపీఐఐసీ భూములను పరిశీలించారు. ఈ భూములను అభివృద్ధి చేసి, 80 పరిశ్రమల ఏర్పాటుకు కేటాయిస్తున్నామని, నెల రోజుల్లో శంకుస్థాపన చేస్తామన్నారు. భూముల్లో లింక్ రోడ్ల పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పట్టించుకున్న వారు లేరని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పరిశోధనలు ప్రగతికి తోడ్పడాలి:కలెక్టర్

పాకాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు, రీసెర్చ్ స్కాలర్లు తమ పరిశోధనలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం గాదంకిలోని ఎన్ఏఆర్ఎల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు పరిశోధనలకు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. వాతావరణంపై ఇక్కడ జరుగుతున్న పరిశోధనలు అభినందనీయమన్నారు. పరిశోధనా ఫలితాలు వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగకరమన్నారు. మొంథా తుపానుకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడానికి వాతావరణ పరిశోధన కేంద్రాలవల్లనే సాధ్యమైందని గుర్తు చేశారు. ఇలాంటి కీలక కార్యాలయ విధుల్లో అప్రమత్తత అవసరమన్నారు. ఆయన సంస్థలోని హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వ్యవస్థ, వాతావరణ పరిశోధన, రాడార్ విధానాలను ఆసక్తిగా పరిశీలించారు. ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్రో, విజిలెన్స్ అధికారి రఘునాథ్, అవేర్‌నెస్ కమిటీ చైర్మెన్ డాక్టర్ చైతన్య జైన్ ఏవో మల్లిక మాధురి, రీసెర్చ్ స్కాలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్ఏఆర్ఎల్ అధికారులు,శాస్త్రవేత్తలు. రీసెర్చి స్కాలర్లు,సిబ్బందితో కలెక్టర్

వైభవంగా అత్తి వరదరాజస్వామి విగ్రహ స్థాపన పూజలు




వరదరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన - హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధగా కొలువైన వరదరాజస్వామి ఆలయంలో గురువారం అత్తివరదరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్ఠాపనం, కుంభారాధనం, మహాశాంతి పూజలు చేశారు. అనంతరం విగ్రహస్థాపన జరిగింది. అనంతరం స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి, అలంకరించారు. ఆలయ ఆవరణంలో హోమపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం అగ్నిప్రణయనం, కుంభారాధనం, సర్వగాయత్రి హోమం జరగనుంది.

పటేల్ స్ఫూర్తితో దేశాభివృద్ధికి పాటుపడాలి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ స్ఫూర్తిగా యువత దేశం కోసం, ఐక్యత కోసం పాటుపడాలని పలువురు వక్తలు యువతకు పిలుపునిచ్చారు. మాజీ ఉప ప్రధాని పటేల్ 150వ జయంతి సందర్భంగా తిరుపతిలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. బాలాజీ కాలనీ నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్వీయూ, ఇతర ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కచ్చపి ఆడిటోరియంలో జరిగిన సభా కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ స్వాతంత్ర్య అనంతరం దేశం ముక్కలయ్యే పరిస్థితుల్లో పటేల్ దృఢ సంకల్పంతో 560 సంస్థానాలను ఒక్కటిగా చేసి భారత దేశంగా మలిచారని చెప్పారు. ఆయన ఆశయాలు, సంకల్పం మనందరికీ ఆచరణ కావాలని పిలుపునిచ్చారు. ఎస్వీయూ వీసీ ఆచార్య నరసింగారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ పటేల్ ఆదర్శంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. రాష్ట్రాలకు నిధుల పెంపు, నీతి ఆయోగ్, జీఎస్టీ తగ్గింపు తదితర విధానాలతో కేంద్ర ప్రభుత్వం దేశ సమగ్రతకు పాటుపడుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్ మాట్లాడుతూ పటేల్ జీవిత విశేషాలను, ప్రముఖ సంఘటనలను ఉదహరిస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, బీజేపీ నేతలు తదితరులు



తిరుపతిలో సాగుతున్న ఐక్యతా ర్యాలీ